వినోద్‌కుమార్‌ను గెలిపించాలి

గుండారంలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, మే 11: కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. మండలంలోని గుండారంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హక్కులు, అభివృద్ధి కోసం కేంద్రంతో కొట్లాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. గతంలో వినోద్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని నియోజక వర్గ ప్రజలను ఆయన కోరారు. మండలంలోని దాచారం, తిమ్మాయ్యపల్లి గ్రామాల్లో జడ్పీటీసీ కనగండ్ల కవిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలి
- మరో 72గంటలు మద్యం, నగదు రవాణా జరుగకుండా నిఘా ఉంచాలి
- సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ

హుస్నాబాద్, మే 11: ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. శనివారం హుస్నాబాద్ పట్టణంతో పాటు, మండలంలోని జిల్లెలగడ్డలో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. మోడల్ స్కూల్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌తో పాటు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. స్ట్రాంగ్‌రూమ్ పరిసర ప్రాంతాలు మొత్తం సీసీ కెమెరాల నిఘాతో ఉండాలన్నారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సమమంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. వచ్చే 72గంటలు ఎంతో కీలకమని, అక్రమ మద్యం, నగదు రవాణా జరుగకుండా చూడాలని పోలీసు అధికారులను సూచించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వాహన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 1,66,91,450ల నగదు పట్టుకున్నట్లు చెప్పారు. 236 ఎక్సైజ్‌కేసులు నమోదు చేసి రూ.12,78,336 విలువైన మద్యం పట్టుకున్నామని తెలిపారు. లోక్ సభ ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 2,482 మంది పోలీసు బలగాలు విధుల్లో ఉంటారన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా వెంటనే 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ వాసాల, సీఐ శ్రీనివాస్, ఎన్నికల సెల్ సీఐ శ్రీధర్‌గౌడ్, ఎస్‌బీ సీఐ కిరణ్, ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

2,482 మందితో పటిష్ట బందోబస్తు

సిద్దిపేట అర్బన్, మే 11: లోక్‌సభ ఎన్నికల కోసం జిల్లావ్యాప్తంగా 2,482 మంది అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఇందులో 1,054 మంది కమిషనరేట్‌లో ఉన్న అధికారులు, సిబ్బంది, సాయుధ బలగాలు, హోంగార్డులు ఉండగా.. 450 మంది కేంద్ర బలగాలైన ఎస్ఎస్‌బీ, సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది, 978 మంది ట్రైనీ ఎస్సైలు, ట్రైనీ కానిస్టేబుళ్లు, ట్రైనీ ఎస్‌పీఎఫ్, తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 1,010 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 122 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 888 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 14వ తేదీ ఉదయం 5 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ తెలిపారు.

అసత్య ఆరోపణలు తగవు

మాట్లాడుతున్న సాయిరామ్ తదితరులు

సిద్దిపేట, మే 11: గులాబీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అసత్య ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాల సాయిరామ్ అన్నారు. శనివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్ నాయకులు లోక లక్ష్మీరాజ్యం, ఇర్షాద్ హుస్సేన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం సిద్దిపేటలో కేసీఆర్ రోడ్ షోకి వచ్చిన స్పందన చూసి కంగుతిన్న రఘునందన్‌రావు కేసీఆర్, హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. కేసీఆర్, హరీశ్‌రావును విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. రఘునందన్‌రావు చేసిన ఆరోపణలు ఏఒక్కటి కూడా నిజం కాదన్నారు. ఎవరెన్ని అసత్య ఆరోపణలు చేసినా మెదక్ ఎంపీ ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు సజ్జు, పెరిక మధు తదితరులు పాల్గొన్నారు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట అర్బన్, మే 11 : లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలోని ఓటర్లందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, ఎన్నికల అధికారి మను చౌదరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోక్‌ఎన్నికభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు 13వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అక్కన్నపేట: నగదు అందజేస్తున్న ఎంపీపీ

ఆర్థిక సహాయం అందజేత

అక్కన్నపేట, మే 11: మండలంలోని దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని వంకాయతండాకు చెందిన గుగులోతు రాజు నాయక్ రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందాడు. రాజునాయక్ మృతదేహంపై ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలూనాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ రూ. 10 వేల నగదును బాధిత కుటుంబానికి పంపించగా అప్పగించామన్నారు. కార్యక్రమంలో నాయకులు జిల్లెల గాల్‌రెడ్డి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రూరల్, మే 11: బండచర్లపల్లికి చెందిన కోల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నాగరాజుతో కలిసి టెన్త్ చదివిన స్నేహితులు రూ.లక్ష జమ చేసి శనివారం అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. రాజు, వెంకట్‌రెడ్డి, రమేశ్, లక్ష్మణ్, మధు, విజయ్, శ్రీనివాస్ , కిషన్, భూపతి, రామస్వామి, శంకర్ పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో క్రీడాకారులతో హెచ్‌సీఏ అధ్యక్ష.కార్యదర్శులు

ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు నిర్వహిస్తాం

సిద్దిపేట, మే 11: సిద్దిపేట మినీ క్రికెట్ స్టేడియంలో త్వరలో ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. రాష్ట్రంలోని 29 జిల్లా కేంద్రాల్లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంపుల సందర్శనలో భాగంగా శుక్రవారం హెచ్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శులు సిద్దిపేటకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో అద్భుతమైన క్రికెట్ మైదానం ఏర్పాటు చేసుకున్నారన్నారు. సిద్దిపేటలోని సమ్మర్ క్యాంపులో 200 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు.. దాదాపు 3వేల మంది క్రీడాకారులు క్యాంపులో శిక్షణ తీసుకుంటున్నారని తెలిపారు. హెచ్‌సీఏ వైస్ ప్రెసిడెంట్ దల్జిత్‌సింగ్, సెక్రటరీ దేవరాజ్, మెదక్ జిల్లా సెక్రటరీ రాజేందర్, సిద్దిపేట సెక్రటరీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

- గులాబీ అధినేత కేసీఆర్‌కు జైకొడుతున్న ప్రజలు
- మళ్లీ సారే రావాలంటున్న జనం

బీఆర్ఎస్‌లో చేరికల జోష్

చేర్యాల: కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు



మిరుదొడ్డి: బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేర్యాల, మే11: మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన మహిళా ఉపాధ్యక్షురాలు, మాజీ వార్డు సభ్యురాలు వల్లూరి కవితతో పాటు పలువురు నాయకులు, మహిళలు కాంగ్రెస్ నుంచి శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు తమకు మాయమాటలు చెప్పి రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేర్పించుకున్నట్లు తెలిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామని, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం శాయశక్తుల కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగె కనకయ్య, ఎంపీటీసీ శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పెద్దింటి ప్రసాద్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో...

మిరుదొడ్డి, మే 11: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు విధానాలు నచ్చకనే బీజేపీని వీడి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల గ్రామానికి చెందిన 20 మంది బీజేపీ నాయకులు వైస్ ఎంపీపీ పోలీసు రాజులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ మండలాధ్యక్షుడు

కొండపాక(కుకునూరుపల్లి), మే 11: కొండపాక మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన బీఎస్పీ కొండపాక మండలాధ్యక్షుడు అందే భూపాల్ శనివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండలాధ్యక్షుడు భూపాల్‌కు లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

గజ్వేల్, మే 11: పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం కోలా అభిరామ్ గార్డెన్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఐలు సైదా, ముత్యం రాజు, మురళి పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యపై దాడికి ఖండన

హుస్నాబాద్‌టౌన్,మే 11: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యపై దాడిచేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వలస సుభాశ్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బీసీల కోసం ఉద్యమంచేస్తున్న నాయకుడిపై టీడీపీ గుండాలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే దాడిచేసిన గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మద్దూరు: నర్సాయపల్లిలో గీతకార్మికుడిని ఓటు అడుగుతున్న మాజీ సర్పంచ్ బద్దిపడగ లలితాకృష్ణారెడ్డి

హుస్నాబాద్‌టౌన్: ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న తదితరులు



అక్కన్నపేట: గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ లక్ష్మీబీలూనాయక్

వర్గల్: నాచారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గులాబీ జోరు

ముమ్మరంగా బీఆర్ఎస్ ప్రచారం
బ్రహ్మరథం పట్టిన ప్రజలు

గులాబీ నేతలు ప్రచారాన్ని ముమ్మరంగా కొనసాగించారు. శనివారం మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయడంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తుచేశారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, మే11

మిరుదొడ్డి: ఖాజీపూర్‌లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక టౌన్: దుబ్బాకలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ కల్పన

ధూళిమిట్ట: ధూళిమిట్టలో ప్రచారం చేస్తున్న మాజీ సర్పంచ్ బీపికావేణుగోపాల్‌రెడ్డి

దుబ్బాక టౌన్ : దుబ్బాక 12వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బట్టు ఎల్లం, పార్టీ శ్రేణులు



చేర్యాల: పోతిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తొగుట: వెంకట్‌రావుపేటలో ప్రచారం చేస్తున్న జీడిపల్లి రాంరెడ్డి

కొమురవెల్లి: మర్రిముచ్చాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ కీర్తనాకిషన్

సిద్దిపేట కమాన్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట టౌన్: చేనేత కార్మికుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నేతలు



సిద్దిపేట టౌన్: నమునా బ్యాలెట్ చూపుతూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



చేర్యాల: కడవేర్గులో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

గుండెనిండా అభిమానం

చేర్యాల, మే 11 : మండలంలోని ముస్త్యాలకు చెందిన పండుగ బాబు బీఆర్ఎస్‌పై ఉన్న తన అభిమానాన్ని చాటుకున్నాడు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై అభిమానాన్ని చాటుతూ భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని తన ఒంటిపై జై కేసీఆర్, జై పల్లా అని రాసుకొని గ్రామంలో చేసిన ప్రచారం అందరినీ ఆకట్టుకుంది.

నిరుపేదకు అంత్యక్రియలు

కొండపాక(కుకునూరుపల్లి), మే 11 : కుకునూరుపల్లి మండలంలోని లక్కుడారంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఆవుసుల సుజాత శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. సుజాతకు గ్రామంలో ఇల్లు కూడా లేదు. ఈ విషయం తెలుసుకున్న బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందజేయడంతో పాటు ఆమె అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశాడు. మృతురాలి కుటుంబానికి డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి రూ.5వేలు అందజేయడంతో పాటు ప్రభుత్వ పరంగా ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిరుదొడ్డి, మే 11: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండలంలోని అల్వాలలో చోటు చేసుకుంది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన పుల్ల పరశురాములు (35) కూలీ పనులతో పాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శనివారం గ్రామానికి చెందిన నాగరాములు అనే వ్యక్తి ఇంటిలో డ్రిల్లింగ్ చేయడానికి పనికి వెళ్లాడు. ఇంటి పైన ఉన్న విద్యుత్ వైర్లను గమనించకుండా ఇంటికి డ్రిల్లింగ్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైయ్యాడు. వెంటనే బాధితుడిని గజ్వేల్ ఏరియా దవాఖానకు తరలించారు. దవాఖానల్లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి

- అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

చేర్యాల, మే11: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేస్తామని అడిషనల్ డీసీపీ ఎస్. మల్లారెడ్డి అన్నారు. శనివారం చేర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల నిర్వహణపై చేర్యాల సర్కిల్ పరిధిలోని రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది, పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అదికారులు, సిబ్బంది, క్యూ ఆర్టీ అధికారులు, సిబ్బందికి ఎన్నికల రోజు నిర్వహించాల్సిన విధులపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈవీఎం, వీవీప్యాడ్, ఎన్నికల సామగ్రి రక్షణ పూర్తి బాధ్యత రూట్ మొబైల్ అధికారులదేనని సూచించారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో చేర్యాల సీఐ శ్రీను, చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి ఎస్సైలు దామోదర్, షేక్ యూనూస్ అహ్మద్‌అలీ, నాగరాజు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీ కడవేర్గు రమేష్ కుమార్, తండ్రి కె.లక్ష్మీ నారాయణ, వయస్సు సుమారు 35 సం.లు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం: ఇంటి నెం.11-2-142, భరత్‌నగర్, సిద్దిపేట, సిద్దిపేట మండలం మరియు జిల్లా వారు తెలంగాణ-502103, సిద్దిపేట మండలం మరియు జిల్లా, సిద్దిపేట, భరత్‌నగర్, స్ట్రీట్ ఓల్డ్ ఎల్.ఎం.బి ఆఫీస్, అసెస్‌మెంట్ నెం.1113004539తో గ్రౌండ్ ఫ్లోర్ 900 చ.అడుగుల (RCC) ఫ్లింత్ ఏరియా, మొదటి అంతస్తు 900 చ.అడుగుల (RCC) ఫ్లింత్ ఏరియాతో 145 చ.గజాల విస్తీర్ణపు నివాస ఇంటి నెం.8-2-62ను కొనుగోలు చేయుటకు 1) శ్రీమతి ఏరబత్తిని ప్రమీల, భర్త స్వర్గీయ లక్ష్మీపతి, వయస్సు సుమారు 60 సం.లు, నివాసం: ఇంటి నెం.8-2-62, భరత్‌నగర్, సిద్దిపేట, సిద్దిపేట జిల్లా, 2) శ్రీమతి ఏరబత్తిని అరుంధతి అలియాస్ లింక అరుంధతి, తండ్రి స్వర్గీయ లక్ష్మీపతి, భర్త ఎల్.అనిల్, వయస్సు సుమారు 33 సం.లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.2-3, దుబ్బాక, దుబ్బాక మండలం, సిద్దిపేట జిల్లా, 3) శ్రీ ఏరబత్తిని వెంకటేష్, తండ్రి స్వర్గీయ లక్ష్మీపతి, వయస్సు సుమారు 38 సం.లు, నివాసం: ఇంటి నెం.8-2-62, భరత్‌నగర్, సిద్దిపేట, సిద్దిపేట జిల్లా, 4) శ్రీ ఏరబత్తిని అనిల్ కుమార్, తండ్రి స్వర్గీయ లక్ష్మీపతి, వయస్సు సుమారు 36 సం.లు, నివాసం: ఇంటి నెం. 8-2-62, భరత్‌నగర్, సిద్దిపేట, సిద్దిపేట జిల్లా వారితో విక్రయ ఒప్పందం కుదుర్చుకొన్నారు.

ఆస్తి షెడ్యూలు

తెలంగాణ-502103, సిద్దిపేట మండలం మరియు జిల్లా, సిద్దిపేట, భరత్‌నగర్, స్ట్రీట్ ఓల్డ్ ఎల్.ఎం.బి ఆఫీస్, అసెస్‌మెంట్ నెం.1113004539తో గ్రౌండ్ ఫ్లోర్ 900 చ.అడుగుల (RCC) ఫ్లింత్ ఏరియా, మొదటి అంతస్తు 900 చ.అడుగుల (RCC) ఫ్లింత్ ఏరియాతో 145 చ.గజాల విస్తీర్ణపు, నివాస ఇంటి నెం.8-2-62 యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ఏరబత్తిని వెంకటేష్ & సోదరుల ఇల్లు, దక్షిణం: 21 అడుగుల రోడ్, తూర్పు: 24 అడుగుల రోడ్, పడమర: అన్నాడి భూపతి రెడ్డి ఇల్లు.

నా క్లయింట్ బయానా అమ్మకపు ప్రతిఫలంగా గణనీయమైన మొత్తాన్ని చెల్లించారు. సదరు విక్రయ లావాదేవీ పట్ల సాధారణ ప్రజానీకంలో ఏవరేని వ్యక్తికి ఏదేని ఆక్షేపణ ఉన్నచో, నేటి నుండి ఏడు రోజులలోగా దిగువ సంతకందారును అన్ని అవసరమైన డాక్యుమెంట్లతో సంప్రదించవచ్చును. లేనిచో సదరు విక్రయలావాదేవీ పట్ల ఎలాంటి చట్టపరమైన ఆక్షేపణలు లేవని నా క్లయింట్ భావించి, దానిని పూర్తి చేస్తారు. తదుపరి ఏవిధమైన ఆక్షేపణలూ అనుమతించబడవు.

మెసర్స్ కడవేర్గు నవీన్ కుమార్ & బి.వి అభిజిత్ కుమార్, అడ్వొకేట్స్

406, IV అంతస్తు, బాబూఖాన్ ఎస్టేట్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500029. మొబైల్ నెం. 9030884427.